క్లుప్తంగా

జీపీలకు అవార్డులు



సర్పంచ్, కార్యదర్శిని సన్మానిస్తున్న కలెక్టర్ ప్రియాంక, ప్రజాప్రతినిధులు

ఇల్లెందురూరల్: స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా చల్లసముద్రం, రొంపేడు గ్రామపంచాయతీలకు జిల్లాస్థాయి ఉత్తమ అవార్డులు వచ్చాయి. బుధవారం ఆయా సర్పంచ్‌లు తాటి చుక్కమ్మ, వాంకుడోత్ శంకర్, కార్యదర్శులు లిఖ్యా, అన్వేష్‌లను కలెక్టర్ ప్రియాంక, జిల్లా పంచాయతీ అధికారులు, జెడ్పీటీసీ వాంకుడోత్ ఉమాదేవి, ఎంపీపీ చీమల నాగరత్నమ్మ తదితరులు ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

తోగ్గూడెం సర్పంచ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

పాల్వంచరూరల్: జిల్లాస్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపికై అవార్డు అందుకున్న తోగ్గూడెం సర్పంచ్ శాంతిని ఆదర్శంగా తీసుకోవాలని డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. సర్పంచ్ శాంతి, కార్యదర్శి రవికుమార్‌లను బుధవారం పూలమాలలు, శాలువలతో కొత్వాల సత్కరించి, మాట్లాడారు.

ఎమ్మెల్యేను కలిసిన బీఎంఎస్ నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి బీఎంఎస్ నాయకులు బుధవారం ప్రభాకర్ ఆధ్వర్యంలో కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావును పాత పాల్వంచలోని ఆయన స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సత్కరించారు. త్వరలో టీబీజీకేఎస్‌లో చేరనున్నట్లు ప్రకటించారు.

ఆర్థిక సాయం



డిపాజిట్ అందిస్తున్న పూర్వ విద్యార్థులు

పాల్వంచ: బొల్లేరుగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001–02 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పసులూరి అనిల్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. 38 మంది తోటి పూర్వ విద్యార్థులంతా కలిసి రూ.లక్ష సమకూర్చి మృతుడి పిల్లల పేరు మీద పోస్టాఫీస్‌లో డిపాజిట్ చేసి అందించి స్నేహభావాన్ని చాటుకున్నారు.

విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్లు

చుంచుపల్లి: పెనగడప ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని ఏడు, పదో తరగతి విద్యార్థినులకు చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం శానిటరీ ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎఫ్ఆర్ఓ ఉమ మాట్లాడుతూ.. చేతన ఫౌండేషన్ ద్వారా పలు సామాజిక కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కరోనా సమయం నుంచి ఇప్పటివరకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని చెప్పారు. విద్యార్థులకు చేయూతనందించేందుకు మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

బీఆర్ఎస్‌లో చేరిక

సూపర్‌బజార్(కొత్తగూడెం): లక్ష్మీదేవిపల్లి మండలం గట్టుమళ్ల గ్రామంలో 15 కుటుంబాలు బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కొట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బుధవారం కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు సమక్షంలో పాతపాల్వంచలోని ఆయన స్వగృహంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ప్రొటోకాల్ విస్మరించారు..

ఇల్లెందురూరల్: పోచారంతండా గ్రామపంచాయతీ కార్యాలయ భవనం నిర్మాణం కోసం పాలకవర్గం, గ్రామపెద్దలు సంయుక్తంగా స్థలాన్ని సేకరించామని సర్పంచ్ శ్రీను, ఎంపీటీసీ బిచ్చా అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. తమ ప్రమేయం లేకుండా, కనీస సమాచారం లేకుండా కార్యాలయ నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేయడం తమను అవమానించడమేనన్నారు. ప్రొటోకాల్ పాటించకుండా శంకుస్థాపన నిర్వహించిన అధికారులపై చర్య తీసుకోవాలని ఉన్నతాధికారులకు విన్నవించారు. గురువారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

జెండా మోసిన వారికే టికెట్ ఇవ్వండి

ఇల్లెందు: పార్టీ జెండా మోసిన వారికే వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని కాంగ్రెస్ అనుబంధ ఆల్ ఇండియా పంచాయత్ పరిషత్ నియోజకవర్గ చైర్మన్ ఎండీ ఇబ్రహీం అన్నారు. బుధవారం ఇల్లెందులో మాట్లాడుతూ.. కాంగ్రెస్ నుంచి గెలిచి టీఆర్ఎస్‌లో చేరి మళ్లీ కాంగ్రెస్‌లోకి వస్తే ఐదేళ్లు పోటీ చేయకుండా కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే నమ్మకం కలుగుతుందన్నారు. కోరం కనకయ్య కాంగ్రెస్ నుంచి టీఆర్ఎస్ మళ్లీ కాంగ్రెస్‌లోకి వచ్చి టికెట్ రేసులో ఉన్నారని, ఇతరులకు అవకాశం కల్పించాలన్నారు.

అధ్వానంగా క్రీడా ప్రాంగణాలు

- కొరవడిన పర్యవేక్షణ
- రూపం కోల్పోయిన ఆటవస్తువులు
- కార్యాలయానికే పరిమితమైన ప్రాంగణాల క్రీడా సామగ్రి



పిచ్చిమొక్కలతో నిండిన రాఘబోయినగూడెం క్రీడా ప్రాంగణం



సుభాష్‌నగర్‌లో తుప్పు పడుతున్న ఆట వస్తువులు

ఇల్లెందురూరల్: ప్రభుత్వ పాఠశాల అంటే పెద్దపెద్ద తరగతి గదులు.. విశాలమైన ఆటస్థలం.. అందులో పలు క్రీడా కోర్టులు ఉండేవి. విద్యార్థులు ప్రతిరోజూ ఆడుకొని శారీరక వ్యాయామం పొందేవారు. కానీ నేడు విద్యార్థులు ప్రార్థన చేసేందుకు కూడా చాలా పాఠశాలల్లో స్థలం లేదు. కొద్దోగొప్పో ఆటస్థలం ఉన్న పాఠశాలల్లో ఆటలు ఆడించడం మరిచిచారు. ఇక ప్రైవేటు పాఠశాలల్లో అయితే మరింత దారుణం.. ఉన్న స్థలమంతా కాంక్రీట్ మయం చేసి ఆటస్థలాలు లేకుండా చేసేశారు. ఇలాంటి పరిస్థితిలో ఆహ్లాదం, వ్యాయామం దూరమై విద్యార్థుల్లో చిరుప్రాయం నుంచే ఉబకాయం, శారీరక, మానసిక ఎదుగుదల తక్కువగా ఉండటం వంటివి చోటుచేసుకుంటున్నాయి. ఈ సమస్యను అధిగమించేందుకు ఆహ్లాదం, ఆటలపై దృష్టి సారించిన ప్రభుత్వం గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసింది. కానీ అవి కూడా ఆరంభశూరత్వంగా మారిపోవడంతో పల్లెల్లో క్రీడలు పండగలు, ప్రత్యేక దినోత్సవాలకే పరిమితమయ్యే పరిస్థితి నెలకొంది.

భారీ వ్యయంతో పల్లె ప్రకృతివనాల నిర్మాణం..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామంలో ఒక పల్లె ప్రకృతివనం ఏర్పాటు చేసింది. అందులో వందల సంఖ్యలో మొక్కలు నాటించి ఏపుగా పెరిగేలా జాగ్రత్తలు తీసుకుంది. ప్రత్యేక సిబ్బంది పర్యవేక్షణలో ప్రకృతి వనం కొన్ని గ్రామాల్లో పచ్చందాలు విరజిల్లగా మరికొన్ని గ్రామాల్లో కళావిహీనంగా మారిపోయాయి. సాయంత్రం పెద్ద వయస్కువారు వాకింగ్, మధ్యవయస్కులు పచ్చందాలను ఆస్వాదించడం.. చిన్న చిన్న వ్యాయామాలు చేసుకోవడం .. ఇక చిన్నారులు సరదాగా ఆటలు ఆడుకునేందుకు ఉద్దేశించినవే పల్లె ప్రకృతివనాలు. దీనికి అనుగుణంగా ప్రకృతి వనాల్లో వాకింగ్ ట్రాక్‌లు కూడా ఏర్పాటు చేశారు. చిన్నారులు ఆడుకునేందుకు రూ.లక్షల్లో ఖర్చు చేసి ప్రత్యేక పరికరాలను అమర్చారు. కానీ నేడు పార్కుల్లోకి ఎవరూ వెళ్లే పరిస్థితి లేకపోవడంతో అమర్చిన సామగ్రి తుప్పుపట్టిపోతున్నాయి.

రూపం కోల్పోయిన క్రీడా ప్రాంగణాలు...

ప్రతి పల్లెలోనూ యువత ఖాళీ సమయంలో ఆటలు ఆడుకోవాలన్న లక్ష్యంగా ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి ప్రతి గ్రామానికి ఒక క్రీడా ప్రాంగణం చొప్పున కేటాయించింది. అందులో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, లాంగ్‌జంప్ కోర్టులతోపాటు చుట్టూ వాకింగ్ ట్రాక్, మధ్యలో వ్యాయామం చేసుకునేలా ప్రత్యేక పరికరాలను అమర్చారు. కానీ వాటిపై గ్రామపంచాయతీల పర్యవేక్షణ లేకపోవడంతో భారీ వర్షాలకు అవన్నీ బురదగుంతలుగా మారిపోయాయి. మరికొన్ని చోట్ల కనీసం నడకకు కూడా వీలు లేకుండా ఛిద్రమయ్యాయి. దీంతో అందులో అమర్చిన వాలీబాల్ పోల్స్, వ్యాయామం కోసం అమర్చిన సామగ్రి నిరుపయోగంగా మారాయి. ఒకటి, రెండు గ్రామపంచాయతీలలో సర్పంచ్‌లు ప్రత్యేక శ్రద్ధ కనబర్చి క్రీడా ప్రాంగణాలను శుభ్రం చేయించి క్రీడాకారులకు అందుబాటులో ఉంచుతున్నారు. కానీ క్రీడా పరికరాలు ఏవీ అందుబాటులో లేకపోవడంతో ఆయాచోట్ల ప్రాంగణాలు వాకింగ్‌కు మాత్రమే ఉపయోగపడుతున్నాయి. క్రీడల లక్ష్యం నీరుగారిపోతోంది.

కార్యాలయానికే పరిమితమైన సామగ్రి..

క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తెచ్చే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతి క్రీడా ప్రాంగణానికి ఆట వస్తువులను సరఫరా చేసింది. ఒక్కో క్రీడా ప్రాంగణానికి 2 కిట్లు సమకూర్చింది. అందులో 23 ఆట వస్తువులతోపాటు 75 టీషర్టులను సరఫరా చేశారు. ఇంతే కాకుండా రెండు వాలీబాల్ నెట్స్, వాలీబాల్, గాలి కొట్టే పంపు, కొలతల టేపు, డంబెల్స్, డిస్కస్‌త్రో, టెన్నీకాయిట్స్, తాడాటకు తాళ్లు, విజిల్స్, స్టాప్ గో వాచ్, క్రికెట్ బ్యాట్, బంతి, 2 జతల చేతి తొడుగులు, స్టంప్స్ తదితర వస్తువులు మండల పరిషత్ కార్యాలయానికి పక్షం రోజుల క్రితం చేరాయి. కానీ వాటి పంపిణీకి ఎటువంటి మార్గదర్శకాలు జారీ కాకపోవడంతో కార్యాలయంలోనే మగ్గుతున్నాయి.

సద్వినియోగం చేసుకుంటే ప్రయోజనం...

ఇప్పటికే పల్లె ప్రకృతి వనాల్లో చిన్నారుల ఆటల కోసం అమర్చిన విలువైన సామగ్రి నిరుపయోగం ఉండగా.. క్రీడా ప్రాంగణాల్లో అమర్చిన పరికరాలు తుప్పుపట్టి పోతున్నాయి. ఇక పల్లెల్లో ఖాళీగా ఉన్న స్థలాలను వివిధ భవన నిర్మాణాల పేరిట ఛిద్రం చేస్తున్నారు. మరికొన్ని ఆక్రమణకు గురవుతున్నాయి. దీంతో పల్లెల్లో ఆడుకునేందుకు సరైన స్థలాలు లేక క్రీడలపై స్థానికులు ఆసక్తి చూపడం లేదు. ఇదిలా ఉండగా తాజాగా ప్రభుత్వం సరఫరా చేసిన క్రీడా సామగ్రి కార్యాలయానికే పరిమితమైంది.

వినియోగంలోకి తేవాలి..



రూ.లక్షలు వెచ్చించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు ఆలనాపాలనా లేక పిచ్చిమొక్కలకు నిలయంగా మారాయి. ఆడుకునేందుకు అనువుగా లేకపోవడంతో యువత అటుగా చూడటం లేదు. క్రీడా సామగ్రిని పంపిణీ చేసి ప్రాంగణాలను వినియోగంలోకి తేవాలి.

– దైద రమేష్, రాఘబోయినగూడెం

పార్కులు తెరిచి ఉంచాలి



ప్రభుత్వం ఎంతో ఖర్చు చేసి ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలను రోజంతా తెరిచి ఉంచాలి. వృద్ధులు వనంలోకి వెళ్లి ప్రకృతిని ఆస్వాదిస్తారు. సాయంత్రం వేళ వాకింగ్ చేసి ఉత్సాహాన్ని పొందుతారు. చిన్నారులు ఆట వస్తువులను వినియోగించుకొని సంతోషాన్ని ఆస్వాదిస్తారు.

– చీమ లక్ష్మయ్య, బాలాజీనగర్

చర్యలు తీసుకుంటాం..



పల్లె ప్రకృతివనాలలో అమర్చిన ఆట వస్తువులు చిన్నారులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటాం. క్రీడా ప్రాంగణాలను శుభ్రం చేయించి యువత ఆడుకునేలా చర్యలు తీసుకునేలా పంచాయతీ కార్యదర్శులను ఆదేశిస్తాం. క్రీడా సామగ్రి పంపిణీ చేస్తాం.

– బాలరాజు, ఎంపీడీఓ, ఇల్లెందు

ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న ప్రోగ్రాం ప్రతినిధులు

పాల్వంచ: విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకునేలా తమ సామర్థ్యాలను పెంపొందించుకోవాలని కమ్యూనిటీ అండ్ డిజైన్ స్పెషలిస్ట్ (బెంగుళూరు) సయాజ్, ప్రోగ్రాం అసోసియేట్ అభిలాష అన్నారు. బుధవారం స్థానిక అనుబోస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఫైనల్ ఇయర్ విద్యార్థినులకు తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ ఆధ్వర్యంలో ప్లేస్‌మెంట్ సపోర్ట్ మెంటరింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... టెక్నికల్ ప్రోగ్రామింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి ప్రాముఖ్యతను వివరించారు. సంస్థ ద్వారా ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు పొందే విధంగా కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన అసెస్మెంట్‌లో 300 మంది విద్యార్థులు హాజరు కాగా 150 మంది అర్హత సాధించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ బాలు ప్రవరాఖ్య, కళాశాల సెక్రటరీ టి.భరత్ కృష్ణ, టి.అవని, ప్రిన్సిపాల్ డాక్టర ఎన్వీ.సుబ్బారావు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ క్రాంతి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

ఇల్లెందురూరల్: రెండు బైక్‌లు ఢీకొని నలుగురు యువకులు గాయపడ్డ సంఘటన బుధవారం జరిగింది. టేకులపల్లి మండలం ధారపాడు గ్రామానికి చెందిన జార నవీన్, ఇల్లెందు మండలం మాణిక్యారం గ్రామపంచాయతీ ఒంపుగూడెం గ్రామానికి చెందిన ఈసం సునీల్ పోలారం వైపుగా బైక్‌పై వస్తున్నారు. అదే సమయంలో మరో ఇద్దరు యువకులు కొమరం మధు, వికాస్‌లు బైక్‌పై ఇల్లెందు నుంచి మర్కోడు గ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో బొంబాయి తండా గ్రామశివారులో టాటా ఏస్ వాహనాన్ని తప్పించబోయి రెండు బైకులు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నవీన్, సునీల్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి, మెరుగైన చికిత్స కోసం ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. మధు, వికాస్‌లకు స్వల్పంగా గాయాలయ్యాయి.

అంగన్‌వాడీ కేంద్రాలపై దాడులు ఆపండి

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన మూడోరోజు బుధవారం కొనసాగింది. దీక్షా శిబిరంలో అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ కళ్లకు గంతలు కట్టుకొని, మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళనలు కొనసాగిస్తామన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మనెంట్ చేసి, వేతనం రూ.26,000 ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని ఉపయోగించి అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టి తెరిస్తే అడ్డుకుంటామన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా సమ్మె చేస్తుంటే స్పందించకుండా పోలీస్ యంత్రాంగాన్ని ఉసిగొల్పి దాడులు చేయడం దారుణం అన్నారు. – సాక్షి నెట్‌వర్క్



సూపర్‌బజార్(కొత్తగూడెం): కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు



పాల్వంచరూరల్: సీడీపీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



టేకులపల్లిలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు



ఇల్లెందు: మాట్లాడుతున్న చంద్ర అరుణ

నేడు దివ్యాంగ పిల్లలకు ఉపకరణాల పంపిణీ

జూలూరుపాడు: దివ్యాంగ పిల్లలకు అవసరమైన ఉపకరణాలను జిల్లా కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ ఆనందఖని, (తెలంగాణ స్కూల్)లో గురువారం కలెక్టర్ పంపిణీ చేయనున్నారని ఎంఈఓ గుగులోత్ వెంకట్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్లచే నిర్ధారించబడిన మండలం నుంచి 20 మంది దివ్యాంగ పిల్లలను తల్లిదండ్రులు తీసుకొని పంపిణీ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

పాల్వంచ: పట్టణంలోని శేఖరం బంజరలోని తెలంగాణ మైనార్టీ కొత్తగూడెం బాలుర పాఠశాల1 నందు ఖాళీగా ఉన్న పీజీటీ పోస్టు భర్తీకి ఔట్ సోర్సింగ్ పద్ధతిలో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు టీఎంఆర్ఎస్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ టి.జవహర్‌లాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు ఈనెల 16వ తేదీ నాటికి పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 7995057881 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

శంకుస్థాపన

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి గ్రామ పంచాయతీలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించనున్న రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలకు జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు బుధవారం భూమి పూజ చేశారు. మాట్లాడుతూ.. దేశాభివృద్ధికి గ్రామాలే పట్టుకొమ్మలని, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పనతో ఆరోగ్యం సరిగా ఉంటేనే దేశం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ పాలనలో అనేక సంక్షేమ పథకాలు పేద ప్రజలకు చేరుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మ, ఉప సర్పంచ్ బాలకృష్ణ, టీఆర్ఎస్ నాయకులు తొగరు రాజశేఖర్, కరుణాకర్, బండిరాజ్‌గౌడ్, శివాల్, హనుమంత్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

ఇల్లెందు: పట్టణంలోని నెం.2బస్తీకి చెందిన భవాని 13 రోజులుగా కనిపించడం లేదని భర్త మోకాళ్ల గణేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ కరుణాకర్ బుధవారం కేసు నమోదు చేశారు.

భౌతికదాడిపై..

పట్టణంలోని సీఎస్సీ బస్తీ ప్రాంతానికి చెందిన బాబూలాల్ అతని కుమారులు అకారణంగా భౌతిక దాడికి పాల్పడ్డారని ఆరోపిస్తూ డేగంటి కార్తీక్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ కరుణాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పల్లెల్లో మౌలిక వసతులు కల్పిస్తాం..



మొండితోగు గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ

ఇల్లెందురూరల్: ప్రతిపల్లెకు అన్ని సౌకర్యాలు కల్పించడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ అన్నారు. మండలంలోని పలు గ్రామ పంచాయతీలలో సీసీ, బీటీ రహదారులకు, గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. మాట్లాడుతూ.. స్థానిక పాలన ప్రజలకు అందుబాటులో ఉండాలన్న సంకల్పంతో సీఎం కేసీఆర్ చిన్నచిన్న గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. ఆయా గ్రామపంచాయతీల్లో ప్రజలకు సక్రమంగా సేవలందించాలన్న లక్ష్యంతో నూతనంగా ఏర్పడిన ప్రతి గ్రామపంచాయతీలో పంచాయతీ కార్యాలయాన్ని నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే మండలంలోని ప్రతిగ్రామానికి లింకు రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించామని, అంతర్గత రహదారులు, అక్కడక్కడ కొంతమేర పెండింగ్‌లో ఉన్న పనులకు తాజాగా శంకుస్థాపన చేసుకున్నామని వివరించారు. సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ ప్రతి పల్లె అభివృద్ధి పథంలో పయనించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో దిండిగాల రాజేందర్, మెట్టెల కృష్ణ, బానోత్ సంతు, ధనసరి ప్రవంతి, తాటి మౌనిక, సుమలత, దాస్యం ప్రమోద్‌కుమార్, ఘాజీ, బండారు శ్రీనివాస్, శ్రీనివాస్, లష్కర్ తదితరులు పాల్గొన్నారు.

గణేష్ మండపాలకు అనుమతి తప్పనిసరి

టేకులపల్లి: వినాయక చవితి సందర్భంగా టేకులపల్లి మండలంలోని 36 గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేయనున్న గణేష్ మండపాలకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని టేకులపల్లి ఎస్ఐ గస్‌రెడ్డి రమణారెడ్డి బుధవారం తెలిపారు. నిర్వాహకులు విద్యుత్ సరఫరా కోసం విద్యుత్ శాఖ నుంచి అనుమతి పొందాలని, మైక్ అనుమతి కోసం మీసేవ కేంద్రంలో డీడీ చెల్లించి దరఖాస్తు చేయాలన్నారు. గ్రామ పంచాయతీ నుంచి కూడా అనుమతి తీసుకుని అన్ని పత్రాలతో పోలీసు శాఖకు సంబంధించిన ఆన్‌లైన్ లింక్‌లో వివరాలు నమోదు చేసి పత్రాలన్నీ ప్రింట్ తీసుకుని పోలీసు స్టేషన్‌లో అందజేయాలన్నారు. పోలీసు స్టేషన్ నుంచి అనుమతి పొందిన తరువాతనే మండపాలు ప్రారంభించాలన్నారు.

కొత్త రుణాలు మంజూరు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జూలూరుపాడు: జూలూరుపాడు సహకార సంఘం రైతు రుణాలను రీ షెడ్యూల్ చేయడంతోపాటు, కొత్త రుణాలు మంజూరు చేయాలని కోరుతూ సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సొసైటీ సీఈఓ రమణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు జాటోత్ కృష్ణ, మండల కార్యదర్శి బానోత్ ధర్మా మాట్లాడుతూ... స్థానిక సహకార సంఘం పాలకవర్గం ఈనెల 15 నాటికి రుణాలను రీషెడ్యూల్ చేయాల్సి ఉన్నప్పటికీ ఇప్పటి వరకు చేయకపోవడంతో రైతులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. సుమారు 1600 మంది రైతులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా వడ్డీ చెల్లించలేకపోయారని, వీరి వడ్డీ రూ.53 లక్షలు బకాయి ఉందని, అయితే సెంట్రల్ బ్యాంకు వారు మంజూరు చేసిన రూ.50 లక్షలను రైతుల వడ్డీ బకాయి కింద జమ చేసి రెన్యూవల్ చేయాలని కోరారు. రుణాలను రీ షెడ్యూల్ చేయకపోతే సుమారు 4 వేల మంది రైతులకు అన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జగదీష్, వాంకుడోత్ సామ్యా, బానోత్ వీరన్న, బాబు, స్వరూప, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీపై అవిశ్వాసం పెట్టండి



ఆర్డీఓకు ఫిర్యాదు అందజేస్తున్న ఎంపీటీసీలు

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం ఎంపీపీ భూక్యా సోనాపై అవిశ్వాసం తీర్మానం పెట్టాలని తొమ్మిది మంది ఎంపీటీసీలు.. ఆర్డీఓ, సీఈఓ, కలెక్టర్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. మాట్లాడుతూ.. మండలంలోని 31 గ్రామ పంచాయతీలకు గాను 11 మంది ఎంపీటీసీలు ఉన్నట్లు చెప్పారు. ఎంపీపీ భూక్యా సోనా ఏకపక్ష నిర్ణయం తీసుకుంటున్నారని, తొమ్మిది మంది ఎంపీటీసీ ఏరియాల్లో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించడం లేదని ఆరోపించారు. ఎంపీపీపై విశ్వాసం కోల్పోవడం వల్ల అవిశ్వాసం తీర్మానం చేయాలని అధికారులను కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు కొల్లు పద్మ, భూక్యా స్వాతి, గుర్రం బాబూరావు, తరాల రామ్మూర్తి, నూనవత్ గోవింద్, ముక్కెర శిరిష, కుంజా రాంబాబు, కొమురం లలిత, రాంబజమ్మ పాల్గొన్నారు.

అర్హులందరికీ 'గృహలక్ష్మి' మంజూరు చేయాలి

పాల్వంచరూరల్: గృహలక్ష్మి పథకాన్ని కులమతాలు బేధం లేకుండా అర్హులందరికీ అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ నాగరాజుకు అందజేశారు. భద్రాచలం డివిజన్ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను బీఆర్ఎస్ పార్టీ పథకాలుగా మార్చుకుని పార్టీ కార్యకర్తలకే మంజూరు చేస్తున్నారని విమర్శించారు. వీరమల్ల ఉమ, మంకెన వెంకటేశ్వర్లు, సోమ వినోద, ఈరమ్మ, కొల్లు సుమలత, రాజేష్, రాజు, కొల్లు భిక్షం పాల్గొన్నారు.

రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ



కొత్తగూడెంరూరల్: ప్రచారం చేస్తున్న టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ

కొత్తగూడెంరూరల్: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, వెంటనే రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ చేయటం జరుగుతుందని టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ అన్నారు. బుధవారం కొత్తగూడెం పట్టణంలోని 8, 9, 10 వార్డులలో గడప గడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటా తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని, త్వరలో ప్రజలు తగిన రీతీలో బుద్ధి చెబుతారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పేదలకు ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షలతోపాటు, అంబేద్కర్ అభయహస్తం కింద ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ.12లక్షలు అందిస్తుందన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ప్రతినెల రూ.4వేలు ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బొమ్మిడి మల్లికార్జున్, అంతోటిపాల్, పల్లపు వెంకటేశ్వర్లు, సారంగపాణి, జెట్టి మోహన్, హరిసింగ్, వాలి, మేకల హరీష్ తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ అన్నారు. బుధవారం గడప గడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో ప్రచారం నిర్వహించారు. నూకల రంగారావు, కొండెం వెంకన్న గౌడ్, నరసింహాచారి, జలీల్, చాంద్ పాషా, చంద్రగిరి సత్యనారాయణ, కట్టా సోమయ్య, దేవీలాల్, కుమార్ పాల్గొన్నారు.



అటెన్షన్ ప్లీజ్

కేటీపీఎస్ రోడ్డు అధ్వానం



పాల్వంచ మండలంలోని కేటీపీఎస్ 5వ ప్రధాన గేటు నుంచి పాండురంగాపురం, సూరారం, నర్సంపేట గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిపై భారీ వాహనాల రాకపోకలతో రోడ్డుపై గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు పాల్వంచకు 24గంటలు రాకపోకలు సాగిస్తుంటారు. ముఖ్యంగా మహిళలు, గర్భిణులు రహదారిపై రాకపోకలకు భయపడుతున్న పరిస్థితి. పలు ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ఆయా గ్రామప్రజలు కర్మాగారం ఎదుట అందోళన చేసినా, వినతిపత్రాలు అందజేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కేటీపీఎస్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

– పాల్వంచరూరల్

ప్రశ్నించాల్సిన అధికారి :
ప్రభాకర్‌రావు, కేటీపీఎస్, సీఈ
సెల్‌నెంబర్: 9490610705